అమ్మా.. పింఛన్ వస్తోందా..!

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



అంబర్‌పేట పటేల్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: అమ్మా.. ఫించన్ వస్తుందా...ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. మళ్లీ ఓటు కారు గుర్తుకే వేయాలంటూ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రచారం నిర్వహిస్తున్నారు. మహిళలు, వృద్ధులను ప్రత్యేకంగా పలకరిస్తూ ప్రభుత్వం అమలయ్యే పథకాలు, తిరిగి గెలిపిస్తే అమలు చేసే పథకాలను వివరిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. స్థానిక అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పటేల్‌నగర్, న్యూపటేల్‌నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు.

ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలుస్తాం

● అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డి



నేతలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ రోహిణ్‌రెడ్డి

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలుస్తామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చంద్రశేఖర్, బి.రాజుగౌడ్ కాంగ్రెస్ పార్టీ నేత కేపీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రోహిణ్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఆర్.నర్సింగ్‌రావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం



అంబర్‌పేట నరేంద్రనగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి కృష్ణయాదవ్

అంబర్‌పేట్: బీజేపీకి ఓటు వేసి గెలిపిస్తే నిర్మాణాత్మక అభివృద్ధి చేసి చూపిస్తామని ఆ పార్టీ అభ్యర్థి సి.కృష్ణయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్‌లోని నరేంద్ర నగర్, అహ్మద్‌నగర్, అన్నపూర్ణ నగర్, న్యూ పటేల్‌నగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేరుపేరునా పలకరిస్తూ ఓటు వేయాలని అభ్యర్థించారు. పాత పరిచయస్తులతో మాట ముచ్చట కలిపి తను ఎన్నికల బరిలో ఉన్నానని బీజేపీ కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున్న పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ కార్పొరేటర్ పులి జగన్

అంబర్‌పేట్: బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ పులి జగన్, సీనియర్ నాయకులు నగేష్‌గౌడ్‌లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి రోహిన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రేవంత్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన పద్మశాలి సంఘం నేతలు



ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన సంగిశెట్టి జగదీశ్వర్‌రావు ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం ముషీరాబాద్ మహంకాళీ దేవాలయం నుంచి ర్యాలీగా తరలివెళ్లి మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా సంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. పద్మశాలి సంఘం నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ నేతలు సంగిశెట్టి రాజ్‌కుమార్, ఎయిర్‌టెల్ రాజు, అజయ్‌ముదిరాజ్, భిక్షపతియాదవ్, బి.ఎం.శ్రీనివాస్, నేత శ్రీనివాస్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ కోర్సుల గురించి ప్రచారం



ముషీరాబాద్: ఎస్‌ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు అందించే ఉచిత శిక్షణ కోర్సుల గురించి శుక్రవారం సంస్థ సిబ్బంది ప్రచారం నిర్వహించారు. బ్యాంకింగ్, అండ్ ఫైనాన్షియల్ సర్వీసస్, బీపీఏ కోర్సులలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మరింత సమాచారం కోసం 93904 85742 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

అందరి మద్దతు బీఆర్‌ఎస్ అభ్యర్థికే..



భోలక్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల మద్దతు బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కే ఉందని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని గుల్షాన్‌నగర్, కట్టేకాంటా, కరీంమియా మసీద్ వీధిలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో మసీదుల వద్ద కరపత్రాలు పంచుతూ కారు గుర్తుకు ఓటు వేసి ముఠా గోపాల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ భోలక్‌పూర్‌లో సమస్యల పరిష్కారానికి కోట్లాది రూపాయలు వెచ్చించి ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మైనార్టీ కమిటి రాష్ట్ర నాయకులు షరీఫ్, డివిజన్ ఉపాధ్యక్షులు చాంద్‌పాషా పాల్గొన్నారు.

బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా మహేందర్



మహేందర్‌కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బొల్ల మహేందర్‌ను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం నియామకం పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహేందర్‌ను ఆర్.కృష్ణయ్య సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో రాష్ట అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తానని ఆయన తెలిపారు. త్వరలోనే తెలంగాణలో అన్ని జిల్లాలను పర్యటించి బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కమిటీల నియామకం చేపడతామని తెలియాజేశారు. బీసీ సంఘం ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్, రాజేందర్, గుజ్జ కృష్ణ, రాజ్‌కుమార్, నీల వెంకటేష్, రామకృష్ణ, మట్ట జయంతి, నిఖిల్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

దీపాలతోనే దీపావళి జరుపుకుందాం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సంప్రదాయబద్ధంగా దీపాలతోనే దీపావళి జరుపుకొని పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో టపాసులు-పర్యావరణం అనే అంశంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ కులాలు, మతాలకు అతీతంగా దీపాలతోనే దీపావళి జరుపుకుంటున్నామని అన్నారు. టపాకాయలు కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగి సంస్త జీవరాసుల మనుగడకు ప్రమాదకరంగా మారుతుందన్నారు. హైదరాబాద్ జిందాబాద్ నాయకులు మోహన్‌నాయుడు, సుకుమార్, సైదులు, సంగీత, హస్మిత, పావన్, విజయ తదితరులు పాల్గొన్నారు.

జక్కుల విజ్ఞతకు ఆజాద్ స్మారక అవార్డు



కాచిగూడ: ప్రముఖ విద్యావేత్త జక్కుల విజ్ఞతను మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్మారక అవార్డు -2023కు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపిక చేసినట్లు నవభారతి నిర్మాణ్ ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తుల హేమంత్ తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఈనెల 11న శనివారం బర్కత్‌పురలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డును హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ట్రిబినల్ కోర్టు చైర్మన్ జస్టిస్ వామన్‌రావు ముఖ్యఅతిధిగా పాల్గొని అందజేస్తారన్నారు.

కేటీఆర్‌ను కలిసిన నగేష్‌ముదిరాజ్



ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరిన నగేష్‌ముదిరాజ్ శుక్రవారం మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ముషీరాబాద్, మెదక్ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్‌లోకి వచ్చినందుకు అభినందనలు తెలియజేశారు.

ఓయూ-జేఎన్‌టీయూహెచ్ ఒప్పందం

లాలాపేట: ప్రీ-ఇంక్యుబేషన్, ఇంక్యుబేషన్, యాక్సిలరేషన్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేసిన ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబేటర్(ఓటీబీఐ), జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలు (జెఎన్‌టీయూహెచ్) పరస్పర అవగాహన ఒప్పందం చేసుకున్నారు. శుక్రవారం ఓయూలో జరిగిన సమావేశంలో ఓటీబీఐ సీఈఓ డాక్టర్ ఆర్ హఫీజ్ బాషా, జేటీబీఐ ప్రోగ్రాం మేనేజర్ స్వాతి ఆనందం సమక్షంలో ప్రొ.ఇ. విద్యాసాగర్, ప్రొఫెసర్ ఎం. ఆశారాణి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మేరకు దరఖాస్తు ఫారాలను సమష్టిగా పంపిణీ చేయడం, సమర్పించిన ప్రతిపాదనలను మూల్యాంకనం చేయడానికి ఓటీబీఐ, జేటీబీఐలు కలిసి స్క్రీనింగ్ కమిటీని రూపొందించడానికి కలిసి పని చేస్తామన్నారు. ఈ రెండు యూనివర్సిటీల టీబీఐలు ఎంచుకున్న స్టార్టప్‌లకు మార్గ దర్శకత్వం, నెట్వర్కింగ్, నిధుల అవకాశాలను అందిస్తాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్‌పీడీసీఎల్ – 11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా పలుప్రాంతాల్లో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడిఈ విజయభాస్కర్ తెలిపారు. డిడిహెచ్ ఫీడర్ పరిధిలో కట్టమైసమ్మ దేవాలయం, దయానంద్‌నగర్, సాయిసంజీవని కాలేజ్, భగీరథ అపార్ట్‌మెంట్, పద్మకాలనీ తదితర ప్రాంతాల్లో 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, నెహ్రూ నగర్ ఫీడర్ పరిధిలో కాచిగూడ పోలీస్‌స్టేషన్, డీమార్ట్, లాల్ బంగ్లా, నెంబోలి అడ్డా, మాతా టెంపుల్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

అంబర్‌పేట్‌లో 27 మంది నామినేషన్

అంబర్‌పేట్: నామినేషన్ల పర్వం ముగిసి ంది. అంబర్‌పేట నియోజకవర్గంలో 27 మంది అభ్యర్థులు 40 నామినేషన్ సెట్ల ను దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ దాఖలు చివరి రోజు కావడంతో అభ్యర్థులు ముందు జాగ్రత్తగా అదనపు నామినేషన్ సెట్లను వేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యాలయం లోపలికి వచ్చిన వారికి అనుమతి ఇచ్చి సాయంత్రం 6 గంటల వరకు నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగించారు.

నేడు ఉచిత దంత చికిత్సా శిబిరం

నల్లకుంట: దీపావళి పండుగను పురస్కరించుకొని శనివారం(నేడు), సోమవారం రెండు రోజుల పాటు దత్తసాయి దంత వైద్యశాల ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలలో ఉచిత దంత చికిత్సా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్ రంగా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఎదురుగా, అంబర్‌పేట, రామంతాపూర్, నాగోల్, చైతన్యనగర్‌లలో గల దత్త సాయి దంత వైద్య శాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. వివరాలకు 92463 66944 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి రూ.25 వేల విరాళం

దిల్‌సుఖ్‌నగర్: మన్సూరాబాద్ విజయ శ్రీకాలనీ అధ్యక్షుడు జొన్నాడ మోహన్ రెడ్డి, మీనా దంపతులు శుక్రవారం ఆర్ కేపురం డివిజన్‌లోని చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి శుక్రవారం రూ.25 వేల చెక్కును విరాళంగా అందజేశారు. తన తండ్రి దివంగత నారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఈ విరాళం అందజేసినట్టు మోహన్ రెడ్డి తెలిపారు. తాము ఇచ్చిన విరాళం డబ్బుతో విద్యార్థి గృహంలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ కొనుగోలు చేయాలని గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌ను కోరారు.

కాంగ్రెస్ విజయం ఖాయం

కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్



ముషీరాబాద్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్ కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఆరు గ్యారెంటీల కరపత్రాలను పంపిణీ చేస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో బీసీలంతా కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకోని వారి సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ముషీరాబాద్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షులు జనిగె శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ పాల్గొన్నారు.

లోకాయుక్త పటిష్టంతో అవినీతి మాయం



మాట్లాడుతున్న జస్టిస్ సీవీ రాములు, చిత్రంలో కళార్చనబోగి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో లోకాయుక్తను పటిష్టం చేయడంతో పాటు పూర్తి అధికారాలను బదలాయిస్తే అవినీతిని సమూలంగా రూపుమాపే అవకాశం ఉంటుందని రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో పౌర కేంద్రీకృత పాలన పారదర్శకత-అవశ్యకత-సవాళ్లు, సంస్కరణలు అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సుకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లోకాయుక్త పటిష్టంగా ఉంటేనే అవినీతి తగ్గిపోతుందని అభిప్రాయపడ్డారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జస్టిస్ కళార్చనబోగి మాట్లాడుతూ కరోనా సమయంలో న్యాయవ్యవస్థలో తీసుకొచ్చిన ఈ-జస్టిస్ విధానం బాగుందన్నారు. సహచట్టం కమిషన్ పూర్వ సభ్యుడు విద్యాధర్‌భట్, లా కళాశాల ప్రిన్సిపల్ సృజన, ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, అపర్ణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి: ఎన్నికల్లో పాల్గొని నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య రౌడీషీటర్లను హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాత నేరస్థులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అల్లర్లు, నేరాలకు పాల్పడితే చాలా తీవ్రమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ నేతల ప్రచారం

చిక్కడపల్లి : ముషీరాబాద్‌లో బీజేపీని గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ. వినయ్‌కుమార్ కోరారు. బీజేపీ అభ్యర్థి పూసరాజును గెలిపించాలని కోరుతూ శుక్రవారం బాపునగర్, చిక్కడపల్లి, వివేక్‌నగర్, జవహర్‌నగర్, ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్, అశోక్‌నగర్, పీపుల్స్‌పార్క్, కార్మికకమిషనర్‌రేట్ ప్రాంతాల్లో విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఉమేష్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, శ్రీకాంత్, ఆకుల సురేందర్ పాల్గొన్నారు.



ముషీరాబాద్ నియోజకవర్గంలో 35 నామినేషన్లు

ముషీరాబాద్: నామినేషన్‌ల ప్రక్రియ ఈ నెల 3వ తేదీన ప్రారంభమై 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. చివరి రెండు రోజుల్లో జోరుగా నామినేషన్‌లను దాఖలు చేశారు. ఆఖరి రోజు 25 నామినేషన్‌లు దాఖలు చేయడం గమనార్హం. నామినేషన్ల ప్రక్రియ ముగిసేనాటికి మొత్తం 35 మంది నామినేషన్‌లను దాఖలు చేశారు. ఇక ప్రధాన ప్రత్యర్థులైన ముఠా గోపాల్(బీఆర్‌ఎస్), అంజన్‌కుమార్‌యాదవ్(కాంగ్రెస్), పూస రాజు(బీజేపీ)లు బరిలో నిలిచారు. దీంతో పాటు బీఎస్‌పీ, సీపీఎం, ఫార్వర్డ్ బ్లాక్‌లతో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్‌లు దాఖలు చేసి తమ అదృష్టాన్ని పరిక్షించుకోనున్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

అంబర్‌పేట్: అంబర్‌పేట్‌లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఒక్క అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ అభ్యర్థి రోహిన్‌రెడ్డి ఓటర్లను కోరారు. శుక్రవారం బాగ్ అంబర్‌పేట్‌లో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మేనిఫెస్టోలో ఉన్న ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రతి కుటుంబానికి లబ్ధి చేకుర్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన ఓటర్లకు హామీ ఇచ్చారు. చాయ్ బండి, మిర్చిల బండిల వద్ద ఉన్న ఓటర్లను సైతం ఆకట్టుకునే పని చేశారు.

మూడ్రోజుల శిశువుకు రెండు రకాల గుండె సమస్యలు

రాంగోపాల్‌పేట్: మూడు రోజుల శిశువుకు గుండెలో రెండు రకాల సమస్యలు ఏర్పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారికి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వైద్యులు శస్త్ర చికిత్సను ద్వారా ప్రాణాలు కాపాడారు. కిమ్స్ ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ పిడియాట్రిక్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ అనిల్‌కుమార్ ధర్మపురం వివరాలు వెల్లడించారు. జహీరాబాద్‌కు చెందిన మూడు రోజుల చిన్నారికి ట్రాన్స్‌పొజిషన్ ఆఫ్ గ్రేట్ అర్టెరీస్(టీజీఏ) టోటల్ ఎనామలస్ పల్మనరీ వీనస్ కనెక్షన్ (టీఏపీవీసీ) అనే రెండు రకాల సమస్యలు గుండెలో ఏర్పడి శరీరం మొత్తం నీలం రంగులోకి మారింది. ఈ రెండు సమస్యలకు వెంటనే శస్త్ర చికిత్స చేయకపోతే చిన్నారి ప్రాణాలకే ప్రమాదం. సాధారణంగా రెండు ప్రధాన రక్తనాలాలు గుండె నుంచి శరీరం, ఊపిరితిత్తులకు రక్తాన్ని తీసుకెళ్తాయి. టీజీఏ సమస్యతో ఈ రెండు పరస్పరం మారిపోవడంతో శుద్ధి చేసిన రక్తం శరీరానికి అందక, ఊపిరితిత్తుల్లో రక్తంతో ఆక్సిజన్ కలవకపోవడంతో రక్తం శుద్ధికాక చెడు రక్తం వెళ్లడంతో శిశువు శరీరం నీలం రంగులోకి మారింది. టీఏపీవీసీ సమస్యతో ఊపిరితిత్తుల నుంచి గుండెలోని కుడి కర్ణికకు వెళ్లాల్సిన రక్తం, ఎడమ కర్ణికలోకి వెళ్తోంది. టీజీఏ సమస్య కోసం తారుమారైన బృహద్ధమని, ఊపిరితిత్తులకు వెళ్లే రక్తనాళాలలను శస్త్ర చికిత్సతో సరైన స్థితిలో అమర్చారు. బృహద్ధమనిని ఎడమ జఠరికకు, ఊపిరితిత్తుల రక్తనాళాన్ని కుడి జఠరికకు అమర్చారు. టీఏపీవీసీ సమస్యకు ఊపిరితిత్తుల రక్తనాళాన్ని తీసి సరియైన చోట అమర్చారు. గుండెకు సంబంధించిన రక్త నాళాలన్ని చాలా చిన్నవిగా ఉండటం మూడురోజుల శిశువు కావడంతో నిపుణులైన వైద్య బృందంతో ఒక రోజంతా శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశామన్నారు.

ప్రలోభాలు... విందు రాజకీయాలు!

● ఎల్బీనగర్‌లోని పలు కాలనీల్లో మరూ
● రాత్రి వేళ ఓటర్లకు మందు పార్టీలు
● అడిగింది ఇస్తామని హామీలు



ఎల్బీనగర్: ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎల్బీ నగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ప్రలోభాలతో విందు రాజకీయం మొదలైంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఇప్పటికే పలు కాలనీలో రోజు వారీగా రాత్రి వేళలో మందు పార్టీలతో ఓటర్లను ప్రలోభపర్చుకునే పనిలో పడ్డారు. పార్టీ అభ్యర్థులు విజయానికి దోహదపడే ఏ ఒక్క అంశాన్ని కూడా వదులుకోవడంలేదు. ప్రతి రోజూ కాలనీలో ఇంటింటి ప్రచారంతో ర్యాలీలు, చేరికలు, సమావేశాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. కాలనీలో ఓట్లు దండుకునేందుకు వసం దైన దావత్‌లతో ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులతో మాట్లాడి కాలనీ నాయకులు అందరూ హాజరయ్యేలా చూస్తున్నారు. దావత్ సమయంలో అభ్యర్థులు వచ్చి వారితో కాసేపు ముచ్చటించి తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారాని హామీలు..

ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు కాలనీలో నెలకొన్న సమస్యలపై ప్రజలకు హామీలు గుప్పిస్తున్నారు. తాను విజయం సాధించిన వెంటనే మీ సమస్యలను పరిష్కరిస్తానని, అందరూ తన విజయానికి సహకరించాలని కోరుతున్నారు. కొందరు స్థానిక రాజకీయాలతో తమకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తారు. అలాంటి వారిని తమపైపు తిప్పుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్స్ సైతం..

ఎల్బీనగర్ నియోజకవర్గంలో అపార్ట్‌మెంట్లు అధికంగా ఉన్నాయి. కొందరు తమ అపార్ట్‌మెంట్లలో నిర్వహించే సమావేశాలకు అభ్యర్థులను ఆహ్వానించి తమ అపార్ట్‌మెంట్లకు రంగులు వేయాలని కోరుతున్నట్టు తెలుస్తోంది. మరి కొన్ని కాలనీల్లో సంక్షేమ భవనాలు, మినీ ఫంక్షన్ హాళ్లు, పార్కులు కావాలని కోరుతున్నారు. ఓట్లను దండుకునే ప్రయత్నంలో అభ్యర్థులు కాలనీవాసులు ఏది అడిగితే దానికి సై అంటూ హామీ ఇస్తున్నారు. లక్షల ఖర్చు అయినా లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నారు.